# నాలాంటి జీవితం నీకొద్దు చెల్లీ!

**- బి. జ్యోతి**

'పరిస్థితులు మనుష్యుల మధ్య ఉన్న బంధాల్ని తెంచేస్తాయి. ఆ స్థానంలో ఉత్త స్వార్థాన్ని మిగులుస్తాయి.' ఐతే, స్వార్థపరులు సృష్టించే అటువంటి క్లిష్టమైన పరిస్థితులలో సైతం—వాళ్ల సుఖసంతోషాల కోసం తమ జీవితాలను త్యాగం చేసే వ్యక్తులూ వుంటారు. అటువంటి అమాయకులు సంఖ్యలో తక్కువగా వున్నా వాళ్లే లోకంలో మంచి మానవత్వాలపట్ల ఇంకా నమ్మకాన్ని మిగల్చడానికి దోహదం చేస్తుంటారు!



వీధి గుమ్మంలోకి, ఇంట్లోకి కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది కాంతమ్మ. మధ్యలో పాత గోడ గడియారం వంక చూస్తోంది. ఆరున్నర దాటిపోయింది. కూతురు జానకి ఇంకా ఇంటికి చేరలేదు. ఇన్నాళ్లలో ఏ రోజూ కూడా ఆరు దాటాక అయిదు నిమిషాలు కూడా ఆలస్యం చెయ్యలేదు. అలాంటిది ఈ రోజు—మళ్లీ గడియారం వైపు చూసింది. పావు తక్కువ ఏడవుతోంది.

"ఎందుకే కబురు పెట్టావు?" అంటూ వచ్చాడు సుబ్బారావు.

"టైమెంతయిందో చూడండి. అదింకా రాలేదు. ఏమిటయిందో? నాకు కాళ్లు చేతులు ఆడటం లేదు. అలా వెళ్లి కాస్త చూడండి."

"ఎక్కడికి వెళ్లామంటావే? ఆఫీసేమన్నా దగ్గరేమిటి?"

"అలాగని కూర్చుంటారా? ఇంత చీకటి పడిపోతే. ఆఫీసు దగ్గర వాచ్‌మేన్ ఉంటాడు."

"ఇంకా సేపు చూద్దాం. ఏమంత ఆలస్యం అయిందని. ఆఫీసు దగ్గర బయలుదేరింది ఇంటికి రాక ఏమవుతుంది?"

"ఆ మాత్రం తెలివితేటలు నాకూ ఉన్నాయి. ఏనాడూ అది 5 నిమిషాలు కూడా లేటు చెయ్యలేదు. ఆ బస్సులోనే వస్తుంది. ఏదన్నా వనుంటే ముందే చెప్తుంది. అందుకే భయం."

"అయిదు రూపాయలుంటే పడెయ్యి. ఆ బస్సులవీ నాకు తెలియదు. రిక్షా ఏమన్నా దొరుకుతుందేమో చూస్తాను. అయిదేం చాలతాయి, పది పడెయ్యి."

"తప్పుతుందా?" విసుక్కుంటూ వెళ్లి తెచ్చి ఇచ్చింది.

ఆయన వెళ్లి పావుగంటయింది. ఇంకా జానకి జాడ లేదు. ఈల వేసుకుంటూ జగ్గు వచ్చాడు. వాడ్ని చూస్తూనే—

"ఒరేయ్! అక్కయ్య ఇంకా రాలేదురా. నాకు కంగారుగా ఉంది." అంది.

"ఎప్పుడూ ఆరుకే వచ్చేస్తుంది కదా. ఏడయిపోయింది" అంటూ గట్టిగా ఈలవేసి 'ఎక్కడో ఏదో జరిగింది' అన్నాడు డిటెక్టివ్‌లా పోజు పెట్టి.

"చాల్లే. వెధవ మాటలు, వెళ్లి ఒక్కసారి చూసిరా. ఆఫీసు నీకు తెలుసు కదా. మీ నాన్నగార్ని పంపించాను. ఆయనకేం బుర్ర తిన్నగా పనిచెయ్యదు. మంచి వాడివి ఒక్కసారి చూసిరామ్మా" అని బతిమాలింది.

ఒక్కసారి జేబులోంచి దువ్వెన తీసి దువ్వి, 'డబ్బుంటే ఇయ్యి. ఏదన్నా సైకిలు తీసుకుంటాను. అంత దూరం వెళ్లద్దూ." అన్నాడు.

మళ్లీ విసుక్కుంటూ వెళ్లి రూపాయి నోటు తెచ్చి ఇచ్చింది. ఈ హడావుడంతా నిశ్శబ్దంగా గమనిస్తోంది హేమ. మనసులోనే అనుకుంది 'అక్క ఎందుకు రాలేదో?' అని. కాంతమ్మ కంగారు అలాగే ఉంది.

జానకి ఉద్యోగమే ఆ ఇంటికి ఆధారం. అయిదుగురు ఆడపిల్లలు, ఒక్క మగపిల్లవాడు ఉన్న ఆ ఇంటిలో జానకి ఒక్కర్తే తాపత్రయం ఉన్న మనిషి. కానీ అదే ఆ జీవితాన్ని ఒక విధంగా బలి తీసేసుకుంటోంది.

"నేను లేకపోతే ఈ సంసారం ఎలాగా?" అన్న ఆలోచనే తప్ప, "నాకెందుకు పట్టింది? అందరిలాగ నేనూ నాదారి ఎందుకు చూసుకోకూడదు?" అని దులుపుకోలేక, ఊబిలో కూరుకుపోయింది.

పెద్ద పిల్లలిద్దరికీ తండ్రి పెళ్లి చేస్తే, జానకి తరవాతది చదువుకుంటూనే ఎవరితోనో పారిపోయింది. చచ్చినట్టు వెతికి తీసుకొచ్చి పెళ్లి చేశారు. జానకికి చెల్లెలి మీద కోపం రాలేదు. ఆ పరిస్థితుల్లోంచి పారిపోవాలంటే ఆ మాత్రం తెగువ చూపించాలి. లేకపోతే తనలాగే అవుతుంది అనుకుంది అంతే.

ఆఖరిది హేమ ఇంటర్ చదువుతోంది. ఎందుకూ పనికిరాని వాడు కొడుకు జగ్గు. మెట్రిక్ కూడా పాసవలేదు. ఏ పనిలోనూ ఒళ్లూ వంగదు. రోజులో సగం టైము దువ్వెనతో జుట్టు సరి చూసుకోడంతోనే సరిపోతుంది. మిగతాది సినిమాలు చూడటానికి, ఆ కథలు స్నేహితులకి చెప్పడానికి సరిపోతుంది. ఇంట్లో ఆడపిల్ల సంపాదిస్తోందని గానీ, మగపిల్లవాడిగా తనకో బాధ్యత ఉందని గానీ ఆలోచనే లేదు. అతని విషయం ఎపుడో వదిలేసింది జానకి. తెలియచెప్పవలసిన తల్లీతండ్రీ ఊరుకుంటే తనేం చేస్తుంది? ఊరు మీద పడి ఏం చేస్తాడో గానీ వాడి తిరుగుళ్లకి సరిపడ డబ్బు సంపాదిస్తాడు. ఏదో వెధవ పని చేస్తాడని జానకికి అనుమానం. కానీ ఎప్పుడూ అడగలేదు. వాడితో వాగ్వాదం అంటే అసహ్యం. ఇంతయినా కొడుకంటే కాంతమ్మకి అభిమానమే. చూసీ చూడనట్టుగా ఉంటుంది. ఆ విధంగా జానకి జీవితం ఆ ఇంటికి అంకితమైపోయింది.

తండ్రి ఇచ్చిన కాస్తో, కూస్తో ఆస్తి కరిగించేశాడు సుబ్బారావు. చేస్తున్న చిన్న ఉద్యోగం ఊడింది, కంపెనీ మూతపడి. సరిగ్గా ఆ సమయంలో జానకి ఇంటర్ పాసయి, టైపు నేర్చుకుంది. ఇంటి పరిస్థితికి బెంబేలెత్తిపోయి స్నేహితురాలి తండ్రి ద్వారా ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. తండ్రి మళ్లీ ఏదో ఉద్యోగం సంపాదిస్తాడని, తమ్ముడు ప్రయోజకుడవుతాడనీ—అప్పటిదాకా తనే ఆ ఇంటికి ఆసరా కావాలని. అదంతా ఉత్తదే అని చాలా రోజులకి తెలిసింది.

స్నేహితురాళ్లు సలహా ఇచ్చారు కూడా, "నువ్వే ఏదో దారి చూసుకోకపోతే నీ జీవితం ఇంతే. నిన్ను వదలరు. ఇప్పటికన్నా ధైర్యం చెయ్యి. ఎవరో ఒకర్ని చేసేసుకో. మగపిల్లవాళ్లు మాత్రం ఈ రోజుల్లో ఇంతలా చేస్తారనుకుంటున్నావా? పెళ్లి చేసుకుని చక్కా పోతున్నారు మీ ఏడుపేదో మీరు ఏడవండి, అని. రెండేళ్లుపోతే మీ తమ్ముడే ఎవర్తినో చేసుకు వస్తాడు చూడు" అంటూ.

జానకికి ఆ మాటల్లో నిజం తెలుసు. కానీ 'తను లేకపోతే వీళ్లేం తింటారు? ఎలా బతుకుతారు?' అన్న ఊహ నుంచి తప్పించుకోలేకపోయింది.

ఆ ఇంట్లో ఎవరికీ తను చేస్తున్న పనికి కృతజ్ఞత లేదు. తను పడుతున్న కష్టానికి అవగాహన లేదు. తనెంత కోల్పోతున్నదో వాళ్లకి అక్కరలేదు. తన భవిష్యత్తు గురించి ఆలోచించే అవసరమే లేదు. అయినా తెంచుకుని పారిపోలేకపోతోంది జానకి. కొంతమంది ఇంతేనేమో! 'నేనిందుకే పుట్టాను కాబోలు' అనుకోడం అలవాటు చేసుకుంది జానకి.

కాంతమ్మకి కూతురు కష్టపడుతోందని తెలుసు. కానీ ఆ కష్టాన్ని చేజార్చుకోడం ఇష్టం లేదు. మరి వేరే దారి ఏది? ఇంక బాధ్యతగల మనుష్యులేరి? ఎవరో ఒకరు ఆ ఇంటి కోసం త్యాగం చెయ్యక తప్పదు మరి. ఆవిడలోని ఏదో స్వార్థం జానకి పట్ల బాధ్యతని, కర్తవ్యాన్ని మింగేసింది.

ఈ మధ్య ఒకరిద్దరు ఆడపిల్లలు మరో జాతి, కులం వాళ్లని ఎవరినో ఒకరిని చేసుకుని 'మీ ఖర్మ మీరు పడండి' అని కుటుంబాన్ని వదిలించేసుకున్న కబుర్లు విని, ఆవిడకి ఏదో భయం పట్టుకుంది, ఏనాడో వినుగు పుట్టి ఇదీ అలాంటి పని చెయ్యదు కదా! అని. ఈరోజు జానకి ఆలస్యం ఆవిడలో అటువంటి భయమే కలిగిస్తోంది.

'కొంపతీసి ఇదీ అటువంటిదేమన్నా చెయ్యలేదు గదా, రేప్పొద్దున్న ఎలాగరా భగవంతుడా?' ఆవిడ గుండెల్లో రాయి పడింది. నిస్సత్తువగా మళ్లీ గడియారం వంక చూసింది. సరిగ్గా అదే సమయానికి గుమ్మంలో అడుగు పెట్టింది జానకి.

"అమ్మయ్యా! వచ్చావా? ఏమిటీ ఇంత ఆలస్యం అయింది? ఇందాకట్నించీ హడలి చస్తున్నాను." ఎంత నెమ్మదిగా అందామనుకున్నా ఆ గొంతులో ఏదో ఆందోళన, మరేదో తీవ్రత ధ్వనించాయి.

జానకి నిర్వికారంగా చూసింది ఆవిడ వైపు, 'తను ఆలస్యం చేసినందుకేనా ఈ ఖంగారు? ఇంకేదన్నానా?' అన్నట్టుగా. జానకి చూపుకి ఆవిడ కొంచెం తగ్గింది. 'ఆరు అయిన దగ్గర్నుంచీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాను. నాన్నగారు, జగ్గు ఏమయిందోనని హడలిపోయి అలా ఆఫీసువైపు వెళతామని వెళ్లారు. ఏ రోజూ అయిదు నిమిషాలన్నా ఆలస్యం చెయ్యలేదు నువ్వు. అందుకనే మరీ కంగారు. అసలే రోజులు బాగోలేవు.' అంటూ వంటింట్లోకి దారి తీసింది.

'రోజులెందుకు బాగోలేవు? మనుష్యులే బాగోలేరు. వాళ్ల మనసులే బాగోలేవు.' అనుకుంది జానకి.

"ఆఫీసరుగారి బావమరిది ఒకాయన కొత్తగా వచ్చారు ఈ ఊరికి. వాళ్ల పిల్లలకి కూడా ట్యూషన్ చెప్పమన్నారు. ఆ సంగతి కనుక్కుందామని వెళ్లాను. పొద్దున చెప్పడం మర్చిపోయాను." అదేదో సంజాయిషీ చెప్పుకున్నట్టుగా కాకుండా, మీకెందుకు నేను అన్నీ చెప్పాలి? అన్నట్టుగా ఉంది.

"మరి చెప్పకపోతే ఎలాగే? ఎంత కంగారు పడ్డామో చూడు. అయినా ఇంకా ఎందుకు ఇప్పటికే చాలా అవస్థపడుతున్నావు!" కొంచెం ఎక్కువ సంపాదన అంటే ఆవిడకీ ఆనందంగానే ఉంది మనసులో.


"కూర్చుంటే రోజులు ఎలా గడుస్తాయి? వచ్చే నెల్లో భవానిని పురుటికి తీసుకురావాలి గదా. ఎక్కడ్నుంచి వస్తుంది? అందుకే ఒప్పుకున్నాను. నాకేం సరదా కాదు, ఆఫీసయ్యాక కూడా చాకిరీ చెయ్యడానికి" అంది పుల్ల విరుస్తున్నట్టుగా.

ఆ మాటలకి కాంతమ్మ కొంచెం చిన్నబుచ్చుకుంది. కానీ ఏం చేస్తుంది? 'చెయ్యకపోతే మానెయ్యి. నువ్వు లేకపోతే మాకు గడవదా ఏమిటి?' అనే అవకాశమే లేదు.

ఆ ఇంట్లో మనుష్యులు ఒకే రక్తం పంచుకున్నవాళ్లలా ఉండరు. బద్ధ శత్రువుల్లా వుంటారు. ప్రత్యర్థుల్లా ఉంటారు. ఒకరిని ఒకరు అనుమానంగా చూసుకుంటారు. తల్లికి పిల్లలందరూ సమానమే అన్న మాట జానకికి నమ్మబుద్ధికాదు. 'లేకపోతే తన గురించి ఒక్కసారి కూడా తల్లిలా ఆలోచించదేం అమ్మ?' మిగతా అందరి కోసం తన జీవితాన్ని బలి పెడ్తున్న కాంతమ్మ తల్లిలా కనిపించదు జానకికి. పరిస్థితులు మనుష్యుల మధ్య ఉన్న బంధాల్ని తెంచేస్తాయి. ఆ స్థానంలో ఉత్త స్వార్థాన్ని మిగులుస్తాయి. ఏదో ఖర్మ కొద్దీ ఒక్కచోట పుట్టడం వల్ల అందరూ కలిసి ఒక కప్పు కింద బతికేస్తున్నట్టుంటారు ఆ ఇంట్లో అందరూ.

"ముఖం కడుక్కునిరా, అన్నం వడ్డించేస్తాను" అంటూ, "మీ నాన్నగారు పాపం చీకట్లో ఎక్కడ తిరుగుతున్నారో ఏమో. ఆ జగ్గుగాడు సైకిల్ తీసుకుని ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో? నీ కోసం కంగారు పడిపోయి ఉన్నపళాన పరుగెత్తారు ఇద్దరూ." అని "మేమందరం నీకోసం ఎంత బాధపడిపోతున్నమో చూడు." అని మళ్లీ మళ్లీ నొక్కి చెపుతున్న కాంతమ్మ తాపత్రయం జానకిలో ఏం చలనం కలిగించలేదు.

మామూలుగా అనాసక్తంగా అన్నం తింటోంది. చెయ్యి కడుక్కుని గదిలోకి వచ్చింది. హేమ కళ్లెత్తి అక్క వైపు చూసింది. ఆ ఇంట్లో ఆ పిల్లకి ఎప్పుడూ మాట్లాడే అవకాశం రాదు. అందుకని ఎక్కువగా కళ్లతోనే మాట్లాడుతుంది. ఆ భావాల్ని చదివే ఓపిక ఎవరికన్నా ఉంటే కదా! అటువంటి వాతావరణంలో కూడా చెల్లెలు అంత శ్రద్ధగా చదువుతుంటే జానకికి ఆశ్చర్యంతో పాటు బాధ కూడా కలుగుతుంది. ఏ ఆసక్తితో చదువుతుంది అంత లాగ? జానకి కూడా అలాగే చదివేది. అదే ఈ ఇంటికి, మనుష్యులకీ ఆధారమయింది.



తలనొప్పి ఎక్కువయింది. మాత్ర తీసుకుని మంచినీళ్ల కోసమని వంటింట్లోకి వెళ్లింది.

"మీ ఆఫీసు తెలిసిందో లేదో ఆయనకి. అంత దూరం పోయి వుంటారు. చీకట్లో నీ కోసం పాపం ఎక్కడ తిరుగుతున్నారో ఇద్దరూ. భోజనం వేళ కూడా దాటిపోతోంది." తల్లి మాటలకి మధ్యలోనే అందుకుని—

"అబ్బ! వచ్చిన దగ్గర్నుంచీ వింటున్నాను, నా కోసం వాళ్లిద్దరూ ఎంత కష్టపడిపోతున్నారో అంటూ. ఆపుతావా లేదా? ఎందుకా నోటి చివర మాటలు? నాకేం అక్కర్లేదు. వూరికే హైరాన పడిపోకు. నాకోసం ఎవరు, ఎందుకు, ఎంత తాపత్రయ పడిపోతున్నారో తెలియని వెర్రిదాన్ని కాదు" అని గట్టిగానే అరిచింది.

జానకి గొంతుకకి కాంతమ్మ హడలిపోయింది. నిజం వినడానికి చేదుగానే ఉంటుంది. అయినా అంగీకరించడానికి మనసొప్పదు. ఊరుకోడం ఇష్టంలేక ఆవిడ ఏదో అనబోతుంటే, జానకి మళ్లీ,

"ఎందుకు అనవసరంగా ఇందాకట్నించి గొంతు చించుకుంటావు? నాన్న వీధి చివర బంగారయ్య ఇంటి అరుగుమీద కూర్చుని పేకాట ఆడుతున్నారు. జగ్గుగాడు కిళ్లీ కొట్టు దగ్గర నిలబడి సినిమా కథ చెప్తున్నాడు యాక్షన్‌తో సహా వాడిలాంటి పనికిమాలిన వెధవలకి. ఓపికుంటే వెళ్లి చూసిరా నువ్వే. బస్సుదిగి వస్తుంటే నావైపు చూసిన పాపాన పోలేదు. నాకోసం తాపత్రయపడిపోతున్నారు!" అంటూ గిరుక్కున గదిలోకి వెళ్లి కూలబడింది. మోకాళ్లలో తలదాచుకుంది.

ఆవేశంతో, ఉక్రోషంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఒళ్లంతా వేడెక్కి చెవిలోంచి హోరులా వస్తోంది. ఈ లోకమంతా పగబట్టి తనని సాధిస్తున్నట్టనిపిస్తోంది. ఏమిటి దారి? ఏడుపు తప్ప.

అంతా చూస్తున్న హేమ నెమ్మదిగా లేచి అక్క దగ్గరకొచ్చింది. తల మీద చెయ్యి వేసింది.

"అక్కా పరీక్షలయిపోగానే నేను టైపు నేర్చుకుంటాను. నాకూ ఏదన్నా ఉద్యోగం చూడు. నువ్వు పెళ్లి చేసుకుని వెళ్లిపో అక్కా ఈ ఇంట్లోంచి. మీ ఫ్రెండ్ వాణి అలాగే కదా చేసింది. నువ్విలా ఏడుస్తుంటే నేను చూడలేను" అంటున్న హేమ గొంతు పూడుకుపోయింది.

తలెత్తిన జానకి–హేమ కళ్లల్లో 'నీకు నేను ఈ ఇంట్లోంచి విముక్తి కలిగిస్తాను' అన్న భావం చూసి గుండె నీరయింది. ఏనాడూ ఇలాంటి రెండు సానుభూతి మాటలకి నోచుకోని బతుకు! 'పిచ్చిపిల్లా' అంటూ గుండెలకి హత్తుకుంది. అంతలోనే ఏదో భయంకరమైన భావం మనసులో మెదిలి—

"వద్దమ్మా! అటువంటి ఆలోచన కూడా రానీయకు. నువ్వు బాగా చదువుకో, ఉద్యోగం కూడా చూస్తాను. కానీ పెళ్లి చేసి ఈ ఇంట్లోంచి పంపిస్తాను. నన్ను తప్పించేందుకు వెనక నువ్వున్నావు కానీ నీకు మళ్లీ ఎవరు దారి చూపిస్తారే! నాకే కోరికలూ లేవమ్మా. నా జీవితం ఎలాగో ఎండిపోయింది. నువ్వు సుఖంగా ఉంటే నేను పడ్డ కష్టాన్ని కొంతయినా మర్చిపోతాను. ఒకళ్ల త్యాగం చాలమ్మా ఈ ఇంటికి. నాలాటి జీవితం నీకొద్దు చెల్లీ!" అంటుంటే, పొంగి వస్తున్న ఏడుపును ఆపుకునే వ్యర్థ ప్రయత్నం చేస్తున్నారిద్దరూ. □